నకిలీ విత్తనాల భయం

- సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- గతంలో బయట పడ్డ నకిలీ పత్తి విత్తనాలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు

నవాబుపేట: రైతులు సాగుకు సమాయత్తమవుతున్న తరుణంలో మండలంలో నకిలీ విత్తనాల భయం ఇంకా రైతులను వెంటాడుతూనే ఉంది. 2021లో మండలంలోని కొల్లూర్ గ్రామ సమీపంలో వ్యవసాయ పొలంలో నకిలీ పత్తి విత్తనాలు భారీ ఎత్తున పట్టుబడి ఉమ్మడి జిల్లాలోనే సంచలనం రేపింది. కేవలం ఒకే గ్రామంలో దాదాపుగా 600 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు లభించాయి. వాటి అంచనా దాదాపుగా రూ.4 లక్షలు కాగా, మండల వ్యాప్తంగా రైతులు ఆందోళన చెందారు. తాజాగా సాగుకు సిద్ధం చేస్తున్న తరుణంలో నకిలీ విత్తనాల విషయం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా మండల సరిహద్దు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పెద్ద ఎత్తున పత్తి సాగు చేస్తారు. దీంతో అక్కడే నకిలీ విత్తనాలు పెద్దగా రైతులకు చేరుతుంటాయి. గతంలో పట్టుబడ్డ నకిలీ విత్తనాలు సైతం అక్కడి సరిహద్దు గ్రామం కొల్లూర్ కావడంతో రైతులు ఆందోళన ఎక్కువైంది. పత్తి విత్తనాల విషయంలో రైతులకు నకిలీ భయం చోటు చేసుకుంది. నకిలీపై తమకు సరైన అవగాహన లేకపోవటంతో విత్తనాల ఎంపిక రైతులకు సవాల్‌గా మారింది. గ్రామాల్లో పత్తితో పాటు కంది, వరి లాంటి విత్తనాలు, మామూలు విత్తనాలు సైతం బ్రాండెడ్ కంపెనీల పేరుతో రైతులకు అందించి మోసం చేసే అవకాశం ఏర్పడింది. దీంతో విత్తనాల విషయంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతంలో చాలా చోట్ల వరి, వేరుశనగ విత్తనాలు సరిగా మొలకెత్తకపోవటం, దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి సందర్భంలో రైతులకు నకిలీ విత్తనాలపై పూర్తి అవగాహన కల్పించి నాణ్యమైన విత్తనాలు అందించేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉంది.


కొల్లూర్‌లో పట్టుబడ్డ నకిలీ పత్తివిత్తనాలు (ఫైల్)

విత్తనాలపై రైతులకు సూచనలు ఇవ్వాలి



రైతులకు విత్తనాలపై వ్యవసాయ అధికారులు ముందుగానే సూచనలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసే ముందు విత్తనాల ప్యాకెట్లపై ఎలాంటి నిబంధనలుంటాయి, వేటిని పరిశీలించి విత్తనం కొనాలి, ఎలాంటి విత్తనాలు తీసుకోవాలి, ఎక్కడ తీసుకోవాలనే విషయాలు గ్రామ స్థాయిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు వివరించాలి. రైతుల పొలాలను బట్టి ఎలాంటి విత్తనం వేయాలో రైతులకు సూచనలు చేస్తే ఇబ్బందులు రాకుండా ఉంటుంది. పత్తి వేసే రైతులకు, వరి పంట వేసే రైతులకు వారి పొలాలను బట్టి విత్తనాలు సూచించాలి.

– హన్మంత్‌నాయక్, తూక్యాతండా

నకిలీపై నిరంతరం పర్యవేక్షణ



నకిలీ విత్తనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గతంలో ఇతర ప్రాంతాల నుంచి కొందరు నకిలీ విత్తనాలు తీసుకొచ్చి రైతులకు తక్కువ ధరకు అందిచ్చే ప్రయత్నం చేశారు. వారిని పట్టుకుని నకిలీ విత్తనాలు సీజ్ చేశాం. నాటి నుంచి మండలంలో నకిలీ విత్తనాల జాడ లేకుండా చేశాం. రైతులకు కావాల్సిన మంచి విత్తనాలు, మంచి ధరలకే రైతులకు ఇవ్వాలని విత్తనాల వ్యాపారులకు సూచించాం. ఎలాంటి విత్తనాలు దుకాణంలో ఉన్నయో పూర్తి వివరాలు రైతులకు అందుబాటులో ఉండేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించాం. పోలీసు సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి నకిలీని నిలువరిస్తున్నాం.

– కృష్ణకిషోర్, మండల వ్యవసాయ అధికారి, నవాబుపేట

క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



మిడ్జిల్: మండలంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను గురువారం చొటకుంట తండా, ఈదులబావి తండా, రాయినోనికుంట తండా, మంగళి గడ్డతండాలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు నానునాయక్, భాస్కర్, గోపాల్, శ్రీను. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



స్టేషన్ మహబూబ్‌నగర్: ధర్మ జాగరణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీ రామాలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో రోజు గురువారం సరస్వతీదేవి అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో విక్రమసింహచార్యులు, ప్రతినిధులు రాజేశ్వరి, సులోచన, లక్ష్మి, సురేష్, మహేష్, హన్మంతురెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

వార్డుల్లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని 46, 47 వార్డులు మోనప్పగుట్ట, కిద్వాయిపేటలలో గురువారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పలు విషయాలు ప్రజలకు వివరించారు. ఏఐసీసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోవిందు, నాయకులు చిన్నరాజు, కోట్ల చంద్రయ్య, ఆంజనేయులు, ఐజక్, పాండు, శేఖర్, సత్యనారాయణ, బాసిత్, అజ్మత్‌అలీ, ఉమ్మిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయ ప్రాంగణంలో విద్యార్థులకు నిత్యారాధన శ్లోకాలు, స్తోత్రాలు ఉచితంగా నేర్పించడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అర్చకులు నాగరాజుస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు రెండు వారాల పాటు ఈ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్న 3వ తరగతి నుంచి 7వ తరగతి విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్ స్వాధీనం: కేసు నమోదు

రాజాపూర్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను ఫిల్టర్ చేస్తుండటంతో రాజాపూర్ పోలీసులు గురువారం జేసీబీ, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. రాజాపూర్ శివారులోని దుందుభీ వాగునుంచి అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తుండగా సమాచారం తెలుసుకున్న బ్లూకోర్టు విధులు నిర్వహిస్తున్న కిరణ్‌భార్గవ్, ఖాజాకలీమొద్దీన్‌లు అక్కడి వెళ్లారు. జేసీబీ డ్రైవర్ భీమగళ్ల శ్రీశైలం, ట్రాక్టర్ డ్రైవర్, నర్సింహులును అనుమతి పత్రాలు కోరగా చూపించలేదు. దీంతో జేసీబీ, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా ఇసుకను తరలించాలని చూసినా, కృత్రిమ ఇసుక తయారు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శివానందంగౌడ్ హెచ్చరించారు.

సంకీర్తనల ముద్రణకు ఆర్థిక సాయం



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి సంకీర్తనల ముద్రణకు మండల కేంద్రానికి చెందిన గంజి బాల్‌రాజు ఆర్థిక సాయం చేశారు. గురువారం కురుమూర్తి గ్రామంలో హనుమాన్ భజన మండలి సభ్యుడు హరినాథ్‌కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ కురుమూర్తి స్వామి చరిత్రను దేశమంతట చాటడమే లక్ష్యం అన్నారు. అందుకు సంకీర్తనలను ముద్రించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తుడు విమలన్న, పలువురు ఉన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ


మిడ్జిల్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు


కురుమూర్తి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న జేఎన్ దేవదానం

మిడ్జిల్: ఈనెల 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన, సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జగన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత 11 ఏళ్లుగా పేద కార్మికులకు అన్ని రంగాల్లో అన్యాయం చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూ, కార్మికుల పొట్టకొడుతుందన్నారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య,మధు,తిరుపతయ్య, బాలస్వామి ,ఈదమయ్య, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొని విజవంతం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు జేఎన్ దేవదానం కోరారు. చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామంలో ఉపాధి హామీ కూలీలను సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు కృష్ణయ్య, బాలరాజు, వెంకటన్న, హనుమంతు, తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను నియోజకవర్గంలో విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్ కోరారు. దేవరకద్ర మార్కెట్ యార్డు ఆవరణలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్న లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు నరహరి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

జేపీఎల్‌ను విజయవంతంగా నిర్వహిస్తాం


టీషర్ట్‌లను ఆవిష్కరిస్తున్న జాంగ్ర యువజన సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పట్టణ జాంగ్ర యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జాంగ్ర ప్రీమియర్ లీగ్ (జేపీఎల్-3) నిర్వహిస్తున్నట్లు పట్టణ జాంగ్ర యువజన సంఘం ప్రతినిధులు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత మూడేళ్లుగా జాంగ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జేపీఎల్-3లో 21 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర జాంగ్ర సంఘం అధ్యక్షులు బుగిడి అనూప్, తదితరులు హాజరవుతారని తెలిపారు. ఓపెన్‌స్థాయిలో స్థానిక కుర్విని శెట్టికాలనీలోని జాంగ్ర కమ్యూనిటీ హాల్లో నేటి నుంచి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 40 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం జేపీఎల్-3కి సంబంధించిన టీషర్ట్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో పట్టణ జాంగ్ర యువజన సంఘం అధ్యక్షులు సద్దె పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి టంకశాల మల్లేష్, కోశాధికారి పోతినెపల్లి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు దోమ సాయికుమార్, నాగలి విశ్వకాంత్, సంయుక్త కార్యదర్శులు వన్నాడ అనిల్‌కుమార్, గడిగె చంద్రశేఖర్, కనికె పవన్‌కుమార్, బుట్టా అవినాష్, ప్రచార కార్యదర్శి ముచ్చర్ల శ్రీశైలం, కనికె శివకుమార్ పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్‌కు బాటలు


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న సభ్యులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): చదువుతోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని శ్రీకరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుకాడి శ్యాంసుందర్ అన్నారు. శ్రీకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కమల గార్డెన్‌లో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15ఏళ్ల నుంచి తమ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో పని చేసిన కరోనా వారియర్స్ మున్సిపల్, ఆరోగ్య సిబ్బందిని సన్మానించినట్లు తెలిపారు. తనకు సహకరించే వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వాగ్దేవి కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, ట్రాస్మ లక్ష్మణ్, సంతోష్, భానుచందర్, విష్ణు ప్రణీత, శ్రీకరి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

బస్సులో తప్పిన కుమారుడు తల్లిచెంతకు..



జడ్చర్ల టౌన్: మరికల్ స్టేజి వద్ద కుమారుడితో కలిసి బస్సు ఎక్కిన తల్లి పొరపాటున మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో దిగింది. కుమారుడు మాత్రం బస్సులోనే ఉండిపోయాడు. దీంతో కలవరం చెందిన ఆమె మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో కానిస్టేబుల్ బస్సు వివరాలతో పాటు బాలుడి ఆనవాళ్లను జడ్చర్ల బస్టాండ్ స్టేషన్ మేనేజర్ జయరాజుకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న అతడు ట్రాఫిక్ గైడ్ వెంకటయ్య, నర్సింహులుతో కలిసి బస్సు నంబరు ఆధారంగా కుమారుడిని గుర్తించారు. తరువాత తల్లి జడ్చర్ల బస్టాండ్‌కు వెళ్లగా ఆమెకు అప్పగించారు.

వివాహిత అదృశ్యం


స్వాతి (ఫైల్)

నవాబుపేట: కుటుంబ తగాదాలతో క్షణికావేశానికి గురైన వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలోని హన్మసానిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం.. హన్మసానిపల్లి గ్రామానికి చెందిన నల్లగంటి బాలమణి కూతురు నల్లగంటి స్వాతిని 10ఏళ్ల క్రితం మండలంలోని బంగ్రంపల్లికి చెందిన ముగ్గని మాదవులుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. గత 15 రోజుల క్రితం భార్యాభర్తల మధ్య తగాదాలు రావటంతో ఇద్దరు వాదోపవాదాలు చేసుకున్నారు. దీంతో స్వాతి పుట్టింటికి వచ్చింది. ఈ నెల 13న స్వాతి పుట్టింట్లో నుంచి ఎవరికి చెప్పకుండా అదృశ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు రెండు రోజుల పాటు వెతికి ఆచూకీ లభించక పోవటంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

బక్రీద్ పండుగ శాంతియుతంగా చేసుకోవాలి

ఊట్కూరు: బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ రామ్‌లాల్ సూచించారు. గురువారం పోలీసు స్టేషన్‌లో బక్రీద్ సందర్భంగా ముస్లింలు, విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ నాయకులతో కలిసి శాంతి సమావేశం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. గోవుల అక్రమ రావాణాకు అరికట్టడానికి చెక్‌పోస్టుల దగ్గర తనిఖీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ కృష్ణంరాజు, నాసిర్‌ఖాన్ పాల్గొన్నారు.

22న కంటి వైద్య శిబిరం

నారాయణపేట రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఈనెల 22న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు క్యాంపు ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్ నగర్ కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. 50 సంవత్సరాలు పైబడిన వృద్ధులు తమ ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులలో ఏదైనా ఒకటి తీసుకొని శిబిరంలో పాల్గొనాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన


గండేడ్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న అధికారులు


లింగాయిపల్లిలో లారీ లోడు చేస్తున్న కూలీలు

- కూలీల కొరతపై దృష్టి.. తరుగుపై ఆరా
- వెన్నాచేడ్ కేంద్రానికి టార్పాలిన్‌లు అందజేత

సాక్షి ఎఫెక్ట్..

గండేడ్: కొనుగోలు 'గగ్గోలు' శీర్షికతో గురువారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పలు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. మండలంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, పలుచోట్ల కూలీల కొరత, తరుగు, తూకంలో ఆలస్యం వంటి సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని 'సాక్షి' ప్రచురించడంతో అధికారులు స్పందించారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ, ఏట రామ్‌పాల్, జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ వీరభద్రయ్యలు గండేడ్, లింగాయిపల్లి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. తూకం సక్రమంగా వేస్తున్నారా లేదా? అని పరిశీలించారు. 41 కిలోల కంటే ఒక్క కిలో కూడా ఎక్కువ పెట్టరాదని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. కూలీల కొరత ఉన్న చోట వేరే కొనుగోలు కేంద్రం నుంచి కూలీలను తీసుకొచ్చి ఆలస్యం జగరకుండా చూస్తామని చైర్మన్ లక్ష్మీనారాయణ తెలిపారు. వెంటనే లారీని పిలిపించి ధాన్యం లోడు చేయించారు. గండేడ్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో అవసరమైన రైతులకు టార్పాలిన్‌లు ఇవ్వాల ని ఆయన సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, తూకంలో అక్రమాలు తరుగు వంటివి జరగకుండా చూడాలని ఆయా సెంటర్ల నిర్వాహకులను చైర్మన్ లక్ష్మీనారాయణ కోరారు. బల్సూర్‌గొండలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేంద్రంలో తరుగుపై ఆరా తీశారు. సదరు బాధిత రైతుతో కూడా మాట్లాడారు. తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీ మాధవిలు కొనుగోలు కేంద్రాల్లో పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెన్నాచేడ్ ఐకేపీ కేంద్రానికి 10 టార్పాలిన్‌లు గురువారం ఇచ్చినట్లు మహబూనగర్ మార్కెటింగ్ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. ఆయన మహిళా సమాఖ్యకు చేరుకొని టార్పాలిన్ విషయాన్ని పరిశీలించారు. ఏ కొనుగోలు కేంద్రానికైనా సరే టార్పాలిన్ ఇవ్వడానికి అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు తెచ్చుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

స్వామినారాయణ పాఠశాల విజయోత్సవ ర్యాలీ


జిల్లా ర్యాంకర్‌తో పాటు 91శాతానికి పైగా మార్కులు సాధించిన గురుకుల విద్యార్థులు

జడ్చర్ల టౌన్: సీబీఎస్ఈ ఫలితాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించటంతో పాటు ఇద్దరు విద్యార్థులు జిల్లా టాపర్లు గా నిలవడంతో మండలంలోని నాగసాల వద్ద ఉన్న స్వామినారాయణ అంతర్జాతీయ గురుకుల పాఠశాల నిర్వాహకులు గురువారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆలిండియాలో 500 మార్కులకు గాను 494 మార్కులతో 5వ ర్యాంకు, జిల్లాలో మొదటి ర్యాంకు సాధించడంతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సర్వదర్శన్ దాస్‌జి స్వామిజీ వెల్లడించారు. ర్యాలీలో 91శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తూ ముందుకు సాగారు. ర్యాలీ పట్టణం నుంచి మహబూబ్‌నగర్ మీదుగా భూత్పూర్ వద్ద ముగిసింది. ర్యాలీలో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిర్వహకులు ప్రియదాస్‌జి, ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రైయినీ ఏఈలకు ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన


ట్రైయినీ ఏఈలకు అవగాహన కల్పిస్తున్న పీడీ

హన్వాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై కొత్తగా ఎన్నికైన హౌసింగ్ ఏఈలకు మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు . మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్వహణకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హౌసింగ్ పీడీ వివరించారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన హౌసింగ్ ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కొల్లూర్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ పాఠశాలలో 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అనంతరం పూర్వపు గురువులు జహంగీర్, రామలింగం, రవీందర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాటమరాజు, రాఘవేందర్, శ్రీనివాస్, సుదర్శన్, శ్యాంసుందర్, శివశంకర్, శ్రీను, శ్రీకాంత్‌గౌడ్, నర్సీస్, లలిత, అరుణ, వెంకటమ్మ, తదితరులు ఉన్నారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు గ్రామంలో ఏర్పడిన జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలను కళాశాల సిబ్బంది గురువారం ప్రారంభించారు. నూతనంగా ఏర్పడిన కళాశాల ప్రిన్సిపాల్‌గా వరంగల్ జిల్లా ఆర్‌జేడీపీఈ అంబాజి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన గ్రామీణ విద్యార్థులు కళాశాలలో చేరాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ అంబాజీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి సన్మానించారు.

అర్హులందరికీ ఉపాధి కల్పించాలి


వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న జీఎస్ గోపి

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్తున్న రైతు కూలీలకు ఉపాధి కల్పించాలని, వారికి ఏడాదికి రూ.12,500 చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర చెరుకు సంఘం అధ్యక్షుడు జీఎస్.గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. ఈ నెల 20 జరిగే సార్వత్రిక సమ్మెకు ప్రతి శ్రామికుడు, కూలీలు సంపూర్ణంగా మద్దతు ఇవ్వాలని కోరుతూ గురువారం మండలంలోని కొంకన్‌వానిపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఉపాధి హామీ కూలీలతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు రకం వరిధాన్యానికి కూడా బోనస్‌గా రూ.500 చెల్లించాలని కోరారు. మిల్లర్లు తేమ, తాలు, చెత్త పేరుతో క్వింటాకు 8 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువు దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్, హమాలీ వ్యవస్థను ఏర్పాటు చేయ్యాలని కోరారు. అకాల వర్షాల కా రణంగా రైతులు ధాన్యాన్ని కాపాడుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వెంకటేష్, మహేష్, అంజిరెడ్డి, మొగిలన్న పాల్గొన్నారు.